



అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 2 సంచిక -319 మంగళవారం 24 మార్చి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# మాది స్మార్ట్ గవర్నెన్స్

## శాసనమండలిలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి


**హైదరాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలి**

**మూసీ ప్రక్షాళనతోనే కాలుష్య నివారణ సాధ్యం**

**నగరంలోని పరిశ్రమలు ఓఆర్ఆర్ అవతలకు తరలింపు**


**రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరణ**

**ఎలివేటెడ్ కారిడార్లతో అద్భుత నగరంగా హైదరాబాద్**



**హైదరాబాద్,/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):**
ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామని చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రూపురేఖలు మార్చేందుకే క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ తీసుకొస్తున్నామని వ్యాఖ్యానించారు. కాలుష్యకారక పరిశ్రమలను ఓ ఆర్ ఆర్ బయటకు తరలిస్తామని తెలిపారు. నగరంలో ఉన్న పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తే.. ఆ భూములను మల్టీజోన్స్‌గా వినియోగించుకోవచ్చని వివరించారు. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ఎందుకు సహకరించ లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకే మెట్రోను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రూ.15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎయిర్‌పోర్టులకు మెట్రో కనెక్టివిటీ ఉంటుందని.. కానీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. జూన్, జులైలోపు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పంజాగుట్ట, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్‌లో ఎలివేటెడ్ కారిడార్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరిస్తామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్టు మధ్య నుంచి అండర్‌పాస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. సిగ్నల్స్ దగ్గర వాహనాలు ఆగకుండా వెళ్లాలనేదే తమ ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలే కొన్ని ప్రమాదాలకు కారణమని అన్నారు. చిరు వ్యాపారులకు ఇబ్బంది

మిగతా 2లో.



# 5 రోజులు యుద్ధాన్ని ఆపేస్తున్నాం

**: డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన**


**5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన**

**ఇరాన్, అమెరికా మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని వెల్లడి**

**ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నామని ప్రకటన**

**న్యూఢిల్లీ/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):**
పశ్చిమాసియాలో యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌పై యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నామని ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నామని వెల్లడించారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులుగా ఇరాన్‌తో జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని పేర్కొన్నారు.

మిగతా 2లో.



# యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు

**ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి**

**లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి**

**న్యూఢిల్లీ,/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):**
పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొ చ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా



మిగతా 2లో.




# రైలు ప్రమాదాలకు కవచ్ అడ్డుకట్ట..

**కీలక మార్గంలో సేవలు ప్రారంభం**

**ఢిల్లీ-హౌరా కారిడార్‌లో అందుబాటులోకి వచ్చిన 'కవచ్' వ్యవస్థ**

**ప్రయాగ్‌రాజ్-కాన్పూర్ మధ్య 190 కిలోమీటర్ల మేర సేవలు ప్రారంభం**

**ప్రమాదాలను నివారించి, గంటకు 160 కి.మీ. వేగాన్ని సాధ్యం చేసే టెక్నాలజీ**

# బీజేపీ అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం

## దశల వారీగా అసెంబ్లీ వద్దకు పార్టీ శ్రేణులు.. అడ్డుకున్న పోలీసులు

**హైదరాబాద్//మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమల్లో విఫలమైందంటూ సోమవారం బీజేపీ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు దశల వారీగా పెద్దసంఖ్యలో అసెంబ్లీ వద్దకు చేరుకోగా.. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది.

మిగతా 2లో.



# విద్వేషపూరిత ప్రసంగాలు, నేరాల నిరోధక బిల్లుకు

**తెలంగాణ మంత్రివర్గం ఆమోదం**

**పేరెంట్స్ సామాజిక భద్రత బిల్లుకు ఆమోదం**

**తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోకుంటే వేతనాల్లో కోత**




# ఫార్ములా-ఈ కేసులో ఏసీబీ చార్జిషీట్

**ఏ1గా కేటీఆర్, ఏ2గా అరవింద్‌కుమార్..**




# 'బియ్యం' రాజకీయం



**ఎగుమతులపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు..**

**దీటుగా బదులిచ్చిన మంత్రి ఉత్తమ్!**

**సీబీఐ, ఐడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిని అడ్వైజర్ గా ఎలా నియమించుకుంటారని హరీశ్ ప్రశ్న**

**ఎగుమతులు 22,750 టన్నుల వద్దే ఎందుకు నిలిచిపోయాయని ప్రశ్న**

**హరీశ్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్న ఉత్తమ్**

**ఎగుమతుల్లో ప్రేమ్ చంద్ కు సంబంధం లేదని వ్యాఖ్య**

**హైదరాబాద్ /మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందంటూ తెలంగాణ అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన ఆరోపణలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వేల కోట్ల బ్యాంక్ ఫ్రాడ్, బంగారం స్మగ్లింగ్ వంటి సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్ అనే వ్యక్తిని ప్రభుత్వానికి అడ్వైజర్‌గా ఎలా నియమించుకుంటారని ఆయన ఘాటుగా ప్రశ్నించారు.



## 5 రోజులు యుద్ధాన్ని ఆపేస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

“గత రెండు రోజులుగా అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని ఆదేశించాను“ అని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు.పశ్చిమాసియాలో తాము శాంతికోసం కృషి చేస్తామని ట్రంప్ తెలిపారు. మరోవారం రోజుల పాటు చర్చలు జరిగే అవకాశం ఉందని అన్నారు. చర్చల ఫలితంపై ఆధారపడి భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు.

## యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు

మొదటిపేజీ తరువాయి

వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం ఒఖఉ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్లు ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ఎ÷–లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. అలాగే దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. గతంలో 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పెంచే దిశగా కృషి చేస్తున్నాం అని వివరించారు. ఇంధనంలో ఇథనాల్ కలపడాన్ని పెంచడం ద్వారా ఏటా ముడి చమురు దిగుమతులను 4.5 కోట్ల బ్యారెళ్ల మేర తగ్గించగలిగాం. ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల సంయుక్త కృషితో.. ఈ సంక్షోభం వల్ల తలెత్తే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ఉంది. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులకు సాధ్యమైనంతమేర సాయం అందిస్తూనే ఉంటాం. చర్చలు, దౌత్యం ద్వారా పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం సాధించేలా అన్ని పక్షాలను ప్రోత్సహిస్తున్నాం అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

## అసెంబ్లీలో ‘బియ్యం‘ రాజకీయం

మొదటిపేజీ తరువాయి

ఈ వ్యవహారంపై తక్షణమే ‘హౌస్ కమిటీ’ వేయాలని డిమాండ్ చేసిన హరీశ్ రావు... ప్రభుత్వం చెబుతున్న పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి లక్ష్యం కేవలం 22,750 టన్నుల వద్దే ఎందుకు ఆగిపోయిందని నిలదీశారు.ఏడాది కాలంగా సుమారు 7,500 టన్నుల బియ్యం కాకినాడ పోర్టులో నిలిచిపోయి పురుగులు పడుతున్నాయని, వాటాల బేరసారాలు కుదరకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. ఒకవేళ ప్రభుత్వం పారదర్శకంగా ఉంటే తాము చేసే ఆరోపణలపై విచారణకు సిద్ధపడాలని సవాల్ విసిరారు.హరీశ్ రావు చేసిన ఈ ఆరోపణలను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తిప్పికొట్టారు. ఇవన్నీ కేవలం నిరాధారమైన ఆరోపణలని, ప్రతిపక్ష నేతలు సిఫార్సు చేసిన వారికి పదవులు దక్కలేదనే అక్కసుతోనే సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. హరీశ్ రావు ప్రస్తావించిన ప్రేమ్ చంద్ గార్గ్‌కు ఫిలిప్పీన్స్ బియ్యం ఎగుమతులకు ఎటువంటి సంబంధం లేదని, ఇది పూర్తిగా తెలంగాణ, ఫిలిప్పీన్స్ ప్రభుత్వాల మధ్య జరిగిన అధికారిక ఒప్పందమని స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం కారణంగానే ఎగుమతుల్లో కొంత జాప్యం జరిగిందని, అయితే అక్కడ అన్ని దిగుమతులపై ఆంక్షలు ఉన్నప్పటికీ కేవలం తెలంగాణ బియ్యానికి మాత్రమే మినహాయింపు లభించిందని వివరించారు. కేవలం ఒక షిప్‌మెంట్ మాత్రమే కాకినాడ పోర్టులో నిలిచిపోయిందని, అంతకు మించి అక్రమాలు ఏవీ జరగలేదని మంత్రి సభలో స్పష్టమైన వివరణ ఇచ్చారు.

## రైలు ప్రమాదాలకు కవచ్ అడ్డుకట్ట..

**న్యూఢిల్లీ,/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):**

రైలు ప్రయాణాన్ని మరింత సురక్షితంగా, వేగవంతంగా మార్చే దిశగా భారతీయ రైల్వే కీలక ముందడుగు వేసింది. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీ–హౌరా కారిడార్‌లోని ప్రయాగ్‌రాజ్–కాన్పూర్ సెక్షన్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ‘కవచ్‘ ఆటోమేటిక్ రైలు భద్రతా వ్యవస్థను సోమవారం విజయవంతంగా ప్రారంభించినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

ప్రయాగ్‌రాజ్, కాన్పూర్ మధ్య సుమారు 190 కిలోమీటర్ల మార్గంలో ఈ వ్యవస్థను యాక్టివేట్ చేశారు. రైలు నంబర్ 14163 ద్వారా ఈ వ్యవస్థను అమలులోకి తీసుకురాగా, జనరల్ మేనేజర్ స్వయంగా సుబేదార్‌గంజ్ నుంచి మనౌరీ స్టేషన్ వరకు ఫుట్‌ప్లేట్ తనిఖీ నిర్వహించి పనితీరును సమీక్షించారు. డివిజనల్, హెడ్ క్వార్టర్స్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

‘మేక్ ఇన్ ఇండియా‘లో భాగంగా పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ‘కవచ్‘ వ్యవస్థ, మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలను నివారించడానికి రూపొందించబడింది. లోకో పైలట్ పొరపాటున రెడ్ సిగ్నల్ దాటినా, ఈ వ్యవస్థ ఆటోమేటిక్‌గా బ్రేకులు వేసి రైలును నిలిపివేస్తుంది. రైలు వేగాన్ని, సిగ్నళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతను నిర్ధారిస్తుంది. ఈ వ్యవస్థతో గంటకు 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపడం సాధ్యమవుతుంది.తొలి దశలో చౌరీ చౌరా ఎక్స్‌ప్రెస్‌తో సహా 8 జతల రైళ్లకు ఈ సేవలను అందిస్తారు. రాబోయే నెలల్లో వందే భారత్ సర్వీసులతో పాటు మరిన్ని రైళ్లకు దీన్ని విస్తరించనున్నారు. ఈ వ్యవస్థను ప్రారంభించడానికి ముందు, రైల్వే శాఖ విస్తృతమైన ట్రయల్స్ నిర్వహించింది. వ్యాప్–7 ఇంజిన్లు, ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, 20 కోచ్‌ల వందే భారత్ రైలుతో ట్రయల్స్ జరిపి, విశ్వసనీయతను నిర్ధారించుకున్నారు. 20,000 కిలోమీటర్లకు పైగా ప్యాసింజర్ ట్రయల్స్ కూడా ఎలాంటి సమస్యలు లేకుండా విజయవంతంగా పూర్తిచేశారు.ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఢిల్లీ–ముంబై, ఢిల్లీ–హౌరా కారిడార్‌లలోని కీలక సెక్షన్లతో కలిపి 1,450 కిలోమీటర్ల మార్గంలో ‘కవచ్‘ వెర్షన్ 4.0ను ఏర్పాటు చేశారు. ‘మిషన్ రఫ్తార్‘లో భాగంగా తదుపరి దశలో ఘజియాబాద్–తుండ్లా సెక్షన్‌లో ఈ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

## విద్వేషపూరిత ప్రసంగాలు, నేరాల నిరోధక బిల్లుకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం

**హైదరాబాద్ /మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):**

తెలంగాణ మంత్రివర్గం కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు బిల్లులకు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా విద్వేషపూరిత ప్రసంగాలు, విద్వేషపూరిత నేరాల నిరోధక బిల్లును (హేట్ స్పీచ్) మంత్రివర్గం ఆమోదించింది. మతసామరస్యానికి భంగం కలిగించే పోస్టులు, అల్లర్లు, ఘర్షణలను ప్రేరేపించే ప్రసంగాలను కట్టడి చేసేందుకు ఈ బిల్లును రూపొందించారు.దీనితో పాటు సామాజిక భద్రత, కార్మిక సంక్షేమం మరియు మౌలిక సదుపాయాల కల్పన ధ్యేయంగా ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు పిల్లలు మద్దతుగా ఉండాలనే లక్ష్యంతో పేరెంట్స్ సామాజిక భద్రత బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది. తల్లిదండ్రులను సరిగ్గా ఆదరించని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల్లో కోత విధించాలని నిర్ణయించారు. వారి వేతనం నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు నేరుగా తల్లిదండ్రులకు అందేలా చట్టం తీసుకురానున్నారు.ఎల్ అండ్ టీ నుంచి హైదరాబాద్ మెట్రో స్వాధీన ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రభుత్వపరంగా జరగాల్సిన లావాదేవీల నిర్వహణ బాధ్యతను హెచ్ఎంఆర్ఎల్‌కు అప్పగించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణనపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి కమిటీ సమర్పించిన నివేదికను మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం, న్యాయవాదుల రక్షణ కోసం తీసుకువచ్చే బిల్లులకు ఆమోదం తెలిపింది.

# మాది స్మార్ట్ గవర్నెన్స్

మొదటిపేజీ తరువాయి

ఉన్నా ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీ మాదిరిగా కాలుష్య నగరం కాకూడదనే హిల్ట్ పాలసీ తీసుకువచ్చామని వివరించారు. ప్రతిపక్షాల నేతలు హిల్ట్‌పాలసీపై ఆరోపణలు, అసత్య ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. నగరం నుంచి బయటకు వెళ్లేందుకే ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతోపాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎలివేటెడ్ కారిడార్లకు ఎక్కువ భూమి కూడా అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. గతంలో మాదిరిగా నచ్చితే నజరానా.. లేకపోతే జరిమానా విధించే విధానం ఉండదని చెప్పుకొచ్చారు. గుడ్ గవర్నెన్స్ కాదని.. మాది స్మార్ట్ గవర్నెన్స్ అని వ్యాఖ్యానించారు. అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని.. ప్రతిపక్షాలు, ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రతిపక్షాల నేతలు అభివృద్ధిని అడ్డుకోవాలని చూడొద్దని.. ఏవైనా సూచనలు ఉంటే ఇవ్వండి.. స్వీకరిస్తామని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన అత్యంత అవసరమని తెలిపారు. మూసీ కాలుష్యంతో నల్గొండ జిల్లా ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలు కూడా తినే పరిస్థితి లేదని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను తమ ప్రభుత్వం తీసుకురాలేదని..కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన విధానాన్నే తాము కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. గుజరాత్‌లో సబర్మతి ప్రక్షాళనకు కాంగ్రెస్ సహకరించిందని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనకు రాజకీయ రంగు ఎందుకు? అని ప్రశ్నించారు. ఎవరినీ నిరాశ్రయులను చేయం.. పునరావాసం కల్పిస్తామని భరోసా కల్పించారు. ప్రతిపక్షాల నేతలు అడ్డుకోవడం తప్పించి.. ఏ సలహా ఇచ్చినా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎవరికీ నష్టం కలిగించం.. బాధితులందరినీ ఆదుకుంటామని మాటిచ్చారు. మూసీ పరివాహకంలో ఉన్న అందరికీ మెరుగైన వసతులు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులకు ఇబ్బందులు తప్పట్లేదని తెలిపారు. హైదరాబాద్‌ను విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశంలో ఐదు మెట్రో నగరాలైన హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు అత్యంత కీలకమైనవని చెప్పుకొచ్చారు. పెట్టుబడులను నగరాల నిర్మాణం, నిర్వహణ నిర్దేశిస్తాయని అన్నారు. నగరాలపైనే రాష్ట్రాల ప్రగతి ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఢిల్లీలో కాలుష్యం వల్లే స్కూల్స్, ఆఫీసులకు సెలవులు ఇస్తున్నారని ప్రస్తావించారు. ముంబైలో వర్షం పడిందంటే కదల్లేని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. చెన్నై, బెంగళూరులోనూ ట్రాఫిక్ కష్టాలు తప్పట్లేదని అన్నారు. మానవ తప్పిదాల వల్లే అనేక కష్టాలు వస్తున్నాయని ప్రస్తావించారు. హైదరాబాద్ అంటే లేక్స్ అండ్ రాక్స్ సిటీ అని చెప్పుకొచ్చారు. ఓల్డ్ సిటీగా పిలుస్తున్న ప్రాంతం ఒకప్పుడు ఒరిజినల్ సిటీ అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదాయ మార్గాలు మెరుగుపడటంతో ప్రతి కుటుంబంలో కార్లు పెరిగాయి. ట్రాఫిక్ రద్దీ వల్లే మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించుకున్నాం. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ బాగా పెరిగింది. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తాం. రోడ్లను అండర్‌పాస్‌లు, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్లుగా విభజించాం. ఎక్కడా ట్రాఫిక్ ఆగకూడదనేదే మా లక్ష్యం. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ ముందుకు రాలేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల నేపథ్యంలో రూ.15వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకున్నాం. ఈ ప్రాజెక్టును మరో 76 కి.మీ విస్తరిస్తాం. విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది. నగర శివార్ల నుంచి వచ్చే ఉద్యోగుల సంఖ్య బాగా పెరిగింది. శామీర్‌పేట, మేడ్చల్ వైపు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తాం. దీనికోసం కేంద్ర సంస్థలతో మాట్లాడి భూమి తీసుకుంటున్నాం. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో రోడ్ల విస్తరణకు ఇబ్బందులు ఉన్నాయి. సిగ్నల్ వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నాం. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్నాం. చిరువ్యాపారులకు ఇతర చోట్ల స్థలాలు కేటాయిస్తాం. కొన్నిచోట్ల మల్టీ లెవల్ కారు పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ముందు జాగ్రత్త తీసుకోకుంటే దిల్లీ వలే కాలుష్యం పెరిగిపోతుంది. ఓఆర్ఆర్ లోపల పలుచోట్ల రేడియల్ రోడ్లు వేస్తున్నాం. దూరం తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తున్నాం. సిటీ మధ్య నుంచి అన్ని ప్రాంతాలకూ ఇవి వస్తాయి. దీంతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతుంది. డ్రైనేజీ వ్యవస్థను మారిస్తే మూసీ సుందరీకరణ త్వరగా పూర్తవుతుంది. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. క్యూర్‌లో సర్వీస్ సెక్టార్, ప్యూర్‌లో ఇండస్ట్రియల్ సెక్టార్, రేర్‌లో అగ్రికల్చరల్ సెక్టార్ రానుంది. గుజరాత్ అభివృద్ధిలో భాజపాకు కాంగ్రెస్ పూర్తి సహకారం అందించింది. అన్ని పార్టీల నేతలూ ఒక్కటై నగర అభివృద్ధికి కలిసి రావాలని కోరారు.అన్నారు.

### ఉద్యోగులకు రూ.1.20 కోట్ల బీమా

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ప్రవేశపెట్టిన రూ.1.20 కోట్ల ప్రమాద బీమా పథకం దేశ చరిత్రలోనే చారిత్రక నిర్ణయమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు సోమవారం అసెంబ్లీ హాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి రూ.కోటి చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భం గా సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దురదృష్టవశాత్తు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం రోడ్డున పడే ప్రమాదం ఉందని అన్నారు. యజమానిపై ఆధారపడిన జీవితాలు తారుమారవుతున్న తీరును గమనించిన తమ ప్రభుత్వం, మంత్రి వర్గంలో చర్చించి ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని చెప్పారు.

తాము ప్రవేశపెట్టిన పథకాలు భవిష్యత్‌లో ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా వాటిని అమలు చేసేలా పకడ్బందిగా రూపొందించామని సీఎం అన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టామని వివరించారు. ముందుగా సింగరేణిలో ని 41 వేలమందికి, విద్యుత్ శాఖలోని 51 వేల మంది ఉద్యోగులకు అమలు చేశామన్నారు. నేటి నుంచి రాష్ట్రంలోని 7.57 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ పథకం వర్తిస్తుందని సీఎం ప్రకటించారు. సీపెక్ సర్వే ప్రకారం గుర్తించిన రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్)లో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ 2025 అక్టోబర్ 10న మరణించిన వరుస సురేష్, అలాగే మహబూబ్ నగర్ సర్కిల్ సివిల్ విభాగంలో ఆర్టిజన్‌గా పనిచేస్తూ 2025 ఏప్రిల్ 19న మరణించిన ముక్తార్ బేగ్ కుటుంబాలకు సీఎం ఈ సందర్భంగా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దనసరి అనసూయ సీతక్క, జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్, మహ్మద్ అజహరుద్దీన్, ఇందన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం

మొదటిపేజీ తరువాయి

మహిళా నాయకులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. వారు రోడ్డుపైనే బైఠాయించి ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసెంబ్లీ ముట్టడికి తరలివచ్చిన పార్టీ నాయకులను పోలీసులు నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించి సాయంత్రం విడుదల చేశారు. నాంపల్లి ప్రాంతం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు ర్యాలీగా వచ్చి అసెంబ్లీ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు వ్యూహాత్మకంగా ఆటోలో అసెంబ్లీ వద్దకు చేరుకోగా.. పోలీసులు అదుపులోకి తీసుకుని పంజాగుట్ట స్టేషన్‌కు తరలించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలు రాంచందర్‌రావుకు మద్దతుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ప్రభుత్వ చర్యను ఖండించారు.

### ప్రజాగ్రహాన్ని అణిచివేయలేరు..

అక్రమ అరెస్టులతో ప్రజాగ్రహాన్ని అణిచివేయలేరని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాంచందర్‌రావుతోపాటు పార్టీ నాయకుల అరెస్టును ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన నడుస్తోందా? పోలీసు బలగాలతో నడిపిస్తున్నారా? అని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపితే అరెస్టు చేస్తారా? అని మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 26 నెలలైనా ఆరు గ్యారంటీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని మరింత దివాళా తీయిస్తున్నారు తప్ప.. ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేకుండా పోయిందని విమర్శించారు. కాగా, బీజేపీ నాయకుల అరెస్టును ఎంపీ ఈటల రాజేందర్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకరెడ్డి ఖండించారు.

### పోరాటం ఉధృతం చేస్తాం..

కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాటం ఉధృతం చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు, వాగ్దానాలను పూర్తిగా విస్మరించిందని, ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటి కూడా ప్రజలకు చేరడం లేదని ధ్వజమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప.. మిగతా గ్యారంటీలన్నింటినీ పక్కనబెట్టి, అమలు చేసినట్లు ప్రభుత్వం అబద్ధపు ప్రచారం చేస్తోందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అన్ని వర్గాల వారికి ప్రత్యేక డిక్లరేషన్లు విడుదల చేసి, లక్షలాది కుటుంబాలను నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. అసెంబ్లీ ముట్టడి సందర్భంగా వందలాది మంది కార్యకర్తలను, మహిళలను, అక్రమంగా అరెస్ట్ చేశారని, జిల్లాల నుంచి వస్తున్న శ్రేణులను అడ్డుకున్నారని, అర్ధరాత్రి నుంచే నాయకులను

## ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధతపై ప్రైవేటు బిల్లుకు అనుమతించండి

### స్పీకర్‌ను కలిసి నోటీసును అందజేసిన బీఆర్ఎస్ఎల్పీ..



**హైదరాబాద్, /మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధతకోసం ప్రైవేటు మెంబర్ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టేందుకు అనుమతించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను బీఆర్ఎస్ పార్టీ శాసనసభాపక్షం కోరింది. సోమవారం కేటీఆర్ నేతృత్వంలో స్పీకర్‌ను ఆయన చాంబర్‌లో కలిసిన పార్టీ ఎమ్మెల్యేలు ఈ మేరకు నోటీసును ఇచ్చారు. ప్రైవేటు మెంబర్ బిల్లు ద్వారా ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు వీలు కలుగుతుందని, అత్యంత కీలకమైన ఈ బిల్లును ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి అనుమతినివ్వాలని స్పీకర్‌ను వారు కోరారు. అసెంబ్లీ కార్యదర్శికి కూడా ఈ బిల్లు తాలూకు నోటీసులను కేటీఆర్ అందజేశారు.

## ఫార్ములా-ఈ కేసులో ఏసీబీ చార్జిషీట్

### ఏ1గా కేటీఆర్, ఏ2గా అరవింద్‌కుమార్..

**హైదరాబాద్,/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):**

ఫార్ములా–ఈ కారు రేసు కేసులో కీలక అడుగు పడింది. నిబంధనలకు విరుద్ధంగా రూ.54.88 కోట్లను విదేశీ సంస్థలకు మళ్లించిన వ్యవహారంపై ఏసీబీ అధికారులు సోమవారం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అందులో ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు, ఏ5గా యూకేకు చెందిన ఫార్ములా–ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ) సంస్థను చేర్చారు. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా–ఈ కారు రేసుకు సంబంధించి ఒప్పందాల్లో నిబంధనల ఉల్లంఘన జరిగిందని, విదేశీ సంస్థ అయిన ఎఫ్ఈవోకు చట్ట విరుద్ధంగా రూ.54.88 కోట్లను మళ్లించారంటూ ఏసీబీ గతంలో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో పురపాలక శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశాల మేరకే తాను ఆ నిధులు విడుదల చేసినట్టు.. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన అరవింద్‌కుమార్ ఏసీబీ విచారణలో వెల్లడించారు. తదుపరి దర్యాప్తు పూర్తి చేసిన ఏసీబీ తాజాగా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది.



జర్నలిస్ట్ వార్త
మంగళవారం 24 మార్చి 2026

# మంగళపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..

## ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



**భీమదేవరపల్లి/మార్చి23 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మంగళపల్లి (రాంనగర్) వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంతో గ్రామంలో విషాదం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, వంగర గ్రామానికి చెందిన అంబాల రాజు (49) హుస్నాబాద్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మంగళపల్లి స్టేజ్ వద్ద హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు కోసం వేచి చూస్తున్న గ్రామానికి చెందిన కదిరె కిరణ్ (28) లిఫ్ట్ అడిగాడు. ఈ క్రమంలో కిరణ్ బైక్‌పై ఎక్కుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కదిరె కిరణ్ అక్కడికక్కడే మృతి చెందగా, అంబాల రాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ముల్కనూర్ 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన అంబాల రాజుకు ప్రాథమిక చికిత్స అందించి వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆగ్రహించిన మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు రోడ్డుపై ధర్నాకు దిగుతూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న వంగర ఎస్సై జి. దివ్య సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఏసీపీ ప్రశాంత్ రెడ్డి అక్కడికి చేరుకుని ధర్నా విరమింపజేశారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను సోహల్ ఆలమ్‌గా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



## ముత్తారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఘన వీడ్కోలు



**భీమదేవరపల్లి/మార్చి23 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామపంచాయతీ కార్యదర్శి దేవరకొండ సంపత్ కుమార్ డిప్యూటేషన్ బదిలీపై వేలేరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా వెళ్తున్న సందర్భంగా సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సత్కారం, వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ మాట్ల హరి కుమార్, వార్డు సభ్యులు మ్యాక నరేష్, కొర్ర తిరుపతి, పార్నందుల నవిత, రేణికుంట్ల సందీప్, కడారి ప్రభాస్, దండెపల్లి శిరీష, దొండ మౌనిక విద్యాసాగర్ కలిసి కార్యదర్శి దేవరకొండ సంపత్ కుమార్ కు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా పంచాయతీ కార్యదర్శిగా సంపత్ కుమార్ గ్రామ అభివృద్ధికి అందించిన సేవలను ప్రశంసించారు. గ్రామ ప్రజలతో కలిసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేణికుంట్ల శాంతి కుమార్, నాయకులు గ్రామస్తులు కత్తుల మల్లయ్య, దేవరాజు శంకర్, తాడూరి చిరంజీవి, ఏనుగు రాంరెడ్డి, పోగుల ప్రసాద్, దేవరాజు మొగిలి, గ్రామ పంచాయతీ సిబ్బంది రేణికుంట్ల ఫిలిప్, కడారి ప్రేమానందం, పార్నందుల మహేందర్, చిట్యాల వెంకటమ్మ, గబ్బెట వీరమ్మ, మ్యాకల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుతో మహిళ మృతి



**భీమదేవరపల్లి/మార్చి23 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పయ్యావుల రాజమ్మ (59) పాము కాటుకు గురై మృతి చెందింది. మృతురాలి కుమారుడు పయ్యావుల అనిల్ కుమార్ ముల్కనూర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకుడ సోమవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో రాజమ్మ తన పొలం వద్దకు వెళ్లి ఆవులకు మేత కోసం మొక్కజొన్న చొప్పను తీస్తుండగా మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో గుర్తుతెలియని పాము ఆమె కుడి చేతి మధ్య వ్రేలును కుట్టింది. ఈ విషయాన్ని అక్కడే ఉన్న పయ్యావుల వెంకటేష్‌కు తెలిపింది. వెంటనే ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీనితో వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి రాజమ్మను వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి చేరుకునేలోపే మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# అమరవీరుల త్యాగ స్మరణలో మేరా యువ భారత్ పాదయాత్ర







**వరంగల్/మార్చి 23(జర్నలిస్ట్ వార్త):** దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యలను ముద్దాడిన భగత్ సింగ్ రాజ్ గురు, సుఖ్‌దేవ్ల త్యాగాలను స్మరిస్తూ వరంగల్ జిల్లాలో సోమవారం షాహిద్ దివాస్ వేడుకలు మిన్నంటాయి. కేంద్ర ప్రభుత్వ మేరా యువ భారత్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు భారీ పాదయాత్ర నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు.
మేరా యువ భారత్ వరంగల్ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరింటెండెంట్ బానోతు దేవీలాల్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. 1931 మార్చి 23న ముగ్గురు వీరులకు మరణశిక్ష అమలు చేసిన చారిత్రక నేపథ్యాన్ని గుర్తుచేస్తూ విద్యార్థులతో నిర్వహించిన పాదయాత్ర నగరాన్ని దేశభక్తి భావనలో ముంచెత్తింది. అనంతరం విద్యార్థులచే దేశభక్తి ప్రతిజ్ఞ చేయించారు.నా భారత్ నా బాధ్యత అనే నినాదంతో విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో శ్రమదానం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ వారు చేసిన సేవలు ఆకట్టుకున్నాయి. కేవలం స్మరణకే పరిమితం కాకుండా, సామాజిక సేవ ద్వారా దేశ నిర్మాణంలో యువతను భాగస్వామ్యం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ప్రిన్సిపాల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల వీరోచిత పోరాటాలు నేటి తరానికి దిక్సూచి కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకున్నప్పుడే అమరవీరుల కలలు కన్న భారతావని సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి. సంపత్, మేరా యువ భారత్ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాలు ఆపలేరు

## బిజెపి నాయకులను అరెస్టు చేసిన పోలీసులు



**స్టేషన్ ఘనపూర్/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త) :** అక్రమఅరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, బిజెపి నాయకులను అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని చిల్పూర్ బిజెపి మండల అధ్యక్షుడు గంటే ఉపేందర్ యాదవ్ అన్నారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు, ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, జనగామ జిల్లా బిజెపి అధ్యక్షుడు సౌడ రమేష్ ఆధ్వర్యంలో సోమవారం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన చిల్పూర్ బిజెపి నాయకులు రాష్ట్ర నాయకులు సుభాష్ ,జిల్లా మీడియా కన్వీనర్ రమేష్, చిల్పూ ర్ మండల అధ్యక్షులు గంటే ఉపేందర్ యాదవ్, చిల్పూర్ ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్రీనివాస్, జోగులు, శైలేష్ గౌడ్ తదితరులు అసెంబ్లీ ముట్ట డిలో పాల్గొనగా వీరిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ కు తర లించడం జరిగింది మరికొందరిని హైదరాబాద్ నారాయణగూడ పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు సుభాష్, చిల్పూర్ బిజెపి మండల అధ్యక్షుడు గంటే ఉపేందర్ యాదవ్ మాట్లాడుతూ సీఎంపోలీస్ ఆధ్వర్యంలో ఇలాంటి పరిపాలన పాలిస్తు న్నారని, అక్రమ అరెస్టులను ఖండిస్తూన్నామని, అన్నారు. ఆరు గ్యారెంటీల పథకాల వాగ్దానాలు అమలు చేయలేకపోగా, అమలు చేయకపోవ డంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారంలో అకాల వర్షం బీభత్సం

## అన్నదాత విలవిల -ఇటుక వ్యాపారుల కంటతడి

## నేలవాలిన పంటలు తడిసి ముద్దయిన ఇటుక బట్టీలు కోలుకోలేని నష్టాల్లో రైతాంగం





**బయ్యారం/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండలంలో సోమవారం సాయంత్రం ప్రకృతి ప్రకోపించింది. ఒక్కసారిగా మారిన వాతావరణంతో ఈదురు గాలులు, వడగళ్ల వాన బీభత్సం సృష్టించాయి. అకాల వర్షం దెబ్బకు మండలంలోని రైతాంగంతో పాటు ఇటుక తయారీ రంగం తీవ్రంగా దెబ్బతిన్నది. చేతికి అందవచ్చిన పంట కళ్ల ముందే నాశనం కావడంతో రైతులు గుండె కోతకు గురవుతున్నారు.

### పంటల విధ్వంసం..

మండల వ్యాప్తంగా కురిసిన రాళ్ల వర్షానికి వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. ప్రధానంగా మామిడి తోటల్లో కాయలు రాలిపోవడంతో తోటల యజమానులు లబోదిబోమంటున్నారు. పంట పెట్టుబడి కూడా చేతికి రాదనే ఆవేదనలో రైతులు ఉన్నారు. అకాల వర్షం అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లిందని పలువురు వాపోయారు.

### ముద్దయిన ఇటుకలు..

మరోవైపు, నామాలపాడు, కొత్తపేట పంచాయతీల పరిధిలోని చిన్న తరహా ఇటుక బట్టీల వ్యాపారులకు ఈ వర్షం కోలుకోలేని దెబ్బ తీసింది. ఇప్పుడిప్పుడే తయారై ఆరబెట్టిన వేలాది ఇటుకలు తడిసి ముద్దయ్యాయి. కళ్లాల్లో ఉన్న ఇటుకలు ఆకృతి కోల్పోవడంతో భారీగా ఆర్థిక నష్టం వాటిల్లిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీల ఖర్చులు, ముడిసరుకు పెట్టుబడి అంతా వృథా అయిందని వారు కన్నీటి పర్యంతమయ్యారు.

### ప్రభుత్వ సాయం కోసం వేచిచూపు..

ప్రకృతి వైపరీత్యం కారణంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, నష్టపరిహారం అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# గుండేటి సతీష్‌కు పద్మశాలి ఉగాది సేవా పురస్కారం

## హైదరాబాద్‌లో ఘనంగా అవార్డు ప్రదానం..

## బాబు మోహన్ చేతుల మీదుగా పురస్కారం స్వీకారం

## సూరారం వాసికి రాష్ట్ర స్థాయి గుర్తింపుపై మండల ప్రజల హర్షం



**ఎల్కతుర్తి/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):** సమాజ సేవలో తనదైన ముద్ర వేస్తున్న ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన గుండేటి సతీష్‌కు రాష్ట్ర స్థాయి గౌరవం దక్కింది. హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన 'పద్మశాలి టెక్స్‌టైల్స్ అండ్ లైఫ్ స్టైల్ ఎక్స్పో వేదికగా ఆయనకు పద్మశాలి ఉగాది సేవా పురస్కారం అందజేశారు. పద్మశాలి పురస్కారాల్లో భాగంగా సతీష్ సమాజానికి చేసిన విశేష సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి, ప్రముఖ నటుడు బాబు మోహన్ చేతుల మీదుగా సతీష్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ వేడుకలో తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ్‌కుమార్, తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్, సభా అధ్యక్షులు డాక్టర్ మార్త రమేష్ తదితరులు పాల్గొని సతీష్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు.రాష్ట్ర స్థాయి అవార్డు రావడం పట్ల గుండేటి సతీష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ద్వారా మాట్లాడుతూ తన సేవలను గుర్తించి గౌరవించినందుకు పద్మశాలి కుల బాంధవులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. సతీష్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కడంపై సూరారం గ్రామస్తులు, ఎల్కతుర్తి మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

# బయ్యారంలో మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభించిన సర్పంచ్...





**బయ్యారం/మార్చి 23.(జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం మెగా హెల్త్ క్యాంప్ ను బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.గర్భిణీకి సంబంధించిన పరీక్షలు,అలాగే రక్త పోటు,షుగర్ పరీక్షలు,క్షయ పరీక్షలు లాంటి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో బయ్యారం పిహెచ్ సి డాక్టర్ విజయ్ కుమార్,ఉపసర్పంచ్ ఎనుగుల ఉమా, ఫార్మాసిస్ట్ రామనర్సయ్య, జయరామ్, గుగులోత్ కిషన్ నాయక్,నాయిని శ్రీనివాస్ రెడ్డి,మండా రేణుక,ఆకునూరు సూర్యానారాయణ, కంకటి నారాయణ,సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తున్న సీఎం

## .స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**స్టేషన్ ఘన్పూర్/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):** రైతులను అప్పుల భారీనుండి బయటకు తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘన పూర్ పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఓడిసిఎంఎస్ మార్కెట్ కమిటీ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంబొత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా కొనుగోలు కేంద్రంవద్ద ఉన్న మక్క లను, వాటి తేమ శాతాన్ని పరిశీలించి మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మొట్ట మొదటి మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభించడం చాలా సంతో షంగా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మక్కల కు నిర్ణయించిన మద్దతు ధర 2400ఉండగా మధ్య దళారులు మక్కలను 1600 నుండి 1700 కే కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని తెలిపారు. మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరినవెంటనే మక్కల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.రైతుల ను అప్పుల ఊబినుండి బయటకు తీసుకువచ్చేం దుకు అనేక సబ్సిడీలు, సంక్షేమ పథకాలు అమ లు చేస్తున్నారని తెలిపారు. 21వేల కోట్లతో రుణ మాఫీ, 18వేల కోట్లతో రైతు భరోసా, 3వేల 500 కోట్లతో సన్నాలకు బోనస్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కు 14కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి సహకారంతోనే సాగు నీటి పనులు చేస్తున్నాని అన్నారు. రానున్న రోజులలో నియోజకవర్గంలో 100శాతం గ్రామాలకు సాగు నీరు అందించి ప్రతీ ఎకరానికి రెండు పంటలకు సాగు నీరు అందిస్తాన ని హామీ ఇచ్చారు. అదే నా ప్రాధాన్యత, ప్రణాళిక అని స్పష్టం చేశారు. జఫర్ గడ్ లో మార్కెట్ సబ్ యార్డు పని చేసేవిధంగా చర్యలు తీసుకుంటాన ని అన్నారు. అలాగే మండల కేంద్రాలలో కూడా మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగు నీరు, మక్కలు అరబెట్టుకునే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నీల రాజమ్మ గట్టయ్య, మార్కెట్ డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, మార్క్ ఫెడ్, మార్కెట్, వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యక ర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మృత్యువుతో పోరాడుతున్న యువకుడు

## ఆదుకోవాలని తల్లి ఆవేదన

**-రోడ్డు ప్రమాదంలో ఇస్నపల్లి మహేష్‌కు తీవ్ర గాయాలు.**

**-వైద్య ఖర్చుల కోసం దాతల సాయం కోసం ఎదురుచూపు**



**తల్లాడ/మార్చి 23(జర్నలిస్ట్ వార్త):** విధి ఆడిన వింత నాటకంలో ఒక నిరుపేద కుటుంబం చితికిపోయింది. అండగా ఉంటాడనుకున్న కొడుకు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రి బెడ్‌పై అపస్మారక స్థితిలో కొట్టుమిట్టాడుతుంటే, ఆ తల్లి పడుతున్న రోదన వర్ణనాతీతంగా ఉంది. తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఇస్నపల్లి మహేష్ (24) ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో, తమను ఆదుకోవాలని ఆ తల్లి దాతలను వేడుకుంటోంది. ముత్తగూడెం సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఒక్కసారిగా కుక్క అడ్డం రావడంతో మహేష్ కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. కంటి పైభాగం, తల వెనుక భాగం పగిలిపోవడంతో మెదడులో రక్తం గడ్డకట్టింది. ప్రస్తుతం ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేష్, ప్రమాదం జరిగి మూడు రోజులు గడుస్తున్నా ఇంకా స్పృహలోకి రాలేదు. ఇటీవలే తండ్రి మరణించడంతో ఆ కుటుంబానికి మహేషే ఆధారం. రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో ఉన్న ఆ తల్లి, కొడుకు ప్రాణాలు కాపాడుకోవడం కోసం ఇప్పటికే లక్ష రూపాయిలకు పైగా అప్పులు తెచ్చి వైద్యం చేయిస్తోంది. రోజుకు వేలాది రూపాయలు ఖర్చవుతుండటంతో ముందుకు వెళ్లలేని స్థితిలో ఆమె కన్నీరుమున్నీరవుతోంది. మెరుగైన వైద్యం అందిస్తే మహేష్ కోలుకునే అవకాశం ఉందని వైద్యులు చెబుతుండటంతో, దాతల సాయం కోసం ఆమె ఆశగా ఎదురుచూస్తోంది.

సహృదయం కలిగిన దాతలు, స్వచ్ఛంద సంస్థలు, స్నేహితులు స్పందించి ఈ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని మహేష్ తల్లి యశోద విజ్ఞప్తి చేస్తున్నారు. సాయం చేయదలచిన వారు 98660 29654 లేదా 99084 60315 నంబర్లకు ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా ఆర్థిక సహాయం అందించి ఒక నిండు ప్రాణాన్ని కాపాడాలని కోరుతున్నారు.

# మానవాళికి మానసిక పరిస్థితులు




**తల్లాడ/మార్చి 23(జర్నలిస్ట్ వార్త);**మండలం నారాయణపురం గ్రామంలో పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పాల్గొని ఈ ధ్యాన పిరమిడ్ గురించి మాట్లాడుతూ మానవాళికి ఉన్న మానసిక పరిస్థితులు , ఆందోళనలు ఉంటే ఒక గంట సేపు ఈ ధ్యాన పిరమిడ్ లో కూర్చుంటే మనకి ఎలాంటి ఆందోళనలో ఉండవని మనసు ప్రశాంతంగా ఉంటుందని మనం మనస్ఫూర్తిగా ఆ భగవంతుని ఏదైనా కోరుకుంటే అది ఖచ్చితంగా నెరవేరుతుందని ఈ ధ్యాన పిరమిడ్ లో కూర్చున్న వారికి మూడు రేట్లు దైవ శక్తి కూడా లభిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుకాపు సుధాకర్,వెంకటగిరి సర్పంచ్ దీవెల వెంకటేశ్వర్లు, పొట్టేటిజనార్దన్ రెడ్డి, హెచ్డి కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు,నాయకులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటాం

**: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**కోల్డ్ స్టోరేజీ బాధితులకు బీమా సొమ్ము**

**అందేలా చూడాలని అధికారులకు ఆదేశం**

**మధిరలో సుడిగాలి పర్యటన..**

**శ్రీ సాయి బాలాజీ శీతల గిడ్డంగి పరిశీలన**



**మధిర/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):** అగ్నిప్రమాదంలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, నిబంధనల ప్రకారం బీమా కంపెనీల నుంచి బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం మధిర నియోజకవర్గంలో ఆయన సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా మధిర మండలం ఆత్కూరులోని అగ్నిప్రమాదానికి గురైన శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. కోల్డ్ స్టోరేజీలో మంటలను అదుపు చేసేందుకు తీసుకున్న చర్యలపై అధికారుల నుంచి సమాచారం సేకరించిన డిప్యూటీ సీఎం, మళ్లీ మంటలు చెలరేగకుండా పూర్తిస్థాయి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రమాదంలో మిర్చి పంట నష్టపోయిన బాధితులతో ఆయన నేరుగా మాట్లాడి వారి సమస్యలను విన్నారు. శీతల గిడ్డంగి రికార్డుల ప్రకారం నిల్వ ఉన్న మిర్చికి సంబంధించి రైతులకు బీమా ద్వారా సత్వరమే న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు.

**మధిర మార్కెట్‌లో మెరుగైన సౌకర్యాలు..**

రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఖమ్మం మార్కెట్ తరహాలోనే మధిర మార్కెట్‌లో కూడా మిర్చి అమ్మకాలు, కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మాజీ డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మహమ్మద్ జావేద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు



# నేడు ఎల్కతుర్తి సొసైటీ సర్వసభ్య సమావేశం

**ఉదయం 11:30 గంటలకు ప్రారంభం.. హాజరు కావాలని సభ్యులకు సీఓ విజ్ఞప్తి**



**ఎల్కతుర్తి/మార్చి 24 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ది విశాల సహకార సంఘం సర్వసభ్య సమావేశం నేడు మంగళవారం నిర్వహించనున్నట్లు సంఘం సీఓ తిరుపతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు.సంఘం అఫీషియల్ ఇంచార్జ్ మహమ్మద్ ఆఫ్జలుద్దీన్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. మంగళవారం ఉదయం 11:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సర్వసభ్య సమావేశానికి సంఘంలోని సభ్యులందరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని సీఓ కోరారు.సమావేశానికి సంబంధించిన ఎజెండా, ఇతర పత్రాలను ఇప్పటికే సంబంధిత ఉన్నతాధికారులకు పంపించినట్లు ఆయన వివరించారు. సంఘం బలోపేతం, భవిష్యత్ ప్రణాళికలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

# గిరిజన గూడాల్లో సేవా పరిమళం

## 400 మందికి కడుపునిండా భోజనం

**నారాయణపురంలో ఆత్మా రామ పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభోత్సవం.. అడవి బిడ్డలకు విందు వడ్డించిన కమిటీ సభ్యులు**




**తల్లాడ/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):**మానవ సేవయే మాధవ సేవగా భావించి, అడవి బిడ్డల ఆకలి తీర్చి నారాయణపురం గ్రామ కమిటీ సభ్యులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని నారాయణపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆత్మా రామ పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని, సమీప అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న 60 గిరిజన కోయ కుటుంబాలకు భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.సుమారు 400 మందికి సరిపడా ఐదు రకాల కూరలు, పప్పు, సాంబారు, పెరుగు, వివిధ రకాల తినుబండారాలతో కూడిన రుచికరమైన భోజనాన్ని వడ్డించారు. పచ్చని ప్రకృతి ఒడిలో నివసించే గిరిజన బిడ్డలకు ఈ విందు ఒక మధుర జ్ఞాపకంగా నిలిచింది. డాక్టర్ శ్రీనివాస్ నేతృత్వంలోని ఎన్జీవో సహకారంతో ఈ సేవా యజ్ఞం దిగ్విజయంగా పూర్తయింది. ఈ సందర్భంగా నారాయణపురం కమిటీ బృందం సభ్యులు మాట్లాడుతూ మా రత్నమ్మ స్వచ్ఛంద సేవా సొసైటీ ద్వారా డాక్టర్ శ్రీనివాస్ అందిస్తున్న సేవలు అజరామరమని కొనియాడారు. ఆపదలో ఉన్న పేదలకు చేయూతనివ్వడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని, అడవి బిడ్డల సంక్షేమం కోరి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. సేవా దృక్పథంతో సామాజిక బాధ్యతను నెరవేర్చడమే తమ లక్ష్యమని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు, స్థానికులు మరియు పెద్ద సంఖ్యలో గిరిజన కుటుంబాలు పాల్గొని ఉత్సాహంగా భోజనం చేశారు.

# వైభవంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు కోడూరు నాగేశ్వరరావు నూతన గృహప్రవేశం

**హాజరైన లయన్స్ క్లబ్ జిల్లా ప్రతినిధులు, ప్రముఖులు.. దంపతులకు శుభాకాంక్షల వెల్లువ**



**తల్లాడ/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల కేంద్రంలో సోమవారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు కోడూరు నాగేశ్వరరావు – లక్ష్మి దంపతుల నూతన గృహప్రవేశ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలతో గృహప్రవేశం గావించారు. ఈ శుభకార్యానికి లయన్స్ క్లబ్ జిల్లా స్థాయి నాయకులు మరియు ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రెటరీ దారా శ్రీనివాసరావు, జెడ్.సి బెల్లంకొండ ఆంజనేయులు, డి.సి పులబాల వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా విచ్చేసి నాగేశ్వరరావు దంపతులకు నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కటికి వెంకటేశ్వరరావు, నున్నా తిరుమలరావులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ ప్రముఖులు, బంధుమిత్రులు పాల్గొన్నారు. నూతన గృహంలో అడుగుపెట్టిన నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు గ్రామస్తులు, మహిళలు శుభాకాంక్షలు అందజేశారు. విచ్చేసిన అతిథులకు గృహ యజమానులు సాదరంగా ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు. ప్రముఖుల రాకతో నాగేశ్వరరావు నివాసం వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

# ఘనంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగారగారి ప్రీతమ్ జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన వర్ధన్నపేట ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య**

**శాలువాతో సన్మానించి, కలం బహూకరణ**



**చెంగిచర్ల (హైదరాబాద్)మార్చి 23(జర్నలిస్ట్ వార్త);** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు నగారగారి ప్రీతమ్ జన్మదిన వేడుకలు సోమవారం హైదరాబాద్‌లోని చెంగిచర్లలో గల ఆయన స్వగృహం వద్ద అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య హాజరై ప్రీతమ్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నగారగారి ప్రీతమ్ ని నరుకుడు వెంకటయ్య మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం అక్షరానికి ప్రతిరూపమైన కలం ను బహూకరించి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఎస్సీ సామాజిక వర్గాల అభ్యున్నతికి, పార్టీ బలోపేతానికి ప్రీతమ్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వెంకటయ్య ఆకాంక్షించారు.

ఈ వేడుకల్లో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రీతమ్ కి శుభాకాంక్షలు తెలిపారు.

# జాటోతు హుస్సేన్ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ మండల కార్యదర్శి.



**బయ్యారం/మార్చి 23.(జర్నలిస్ట్ వార్త);**
జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ తండ్రి లచ్చ నాయక్ ఈ మధ్యకాలంలో మృత్యువాత పడడంతో వారి కుటుంబాన్ని సోమవారం బీజేపీ బయ్యారం మండల కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ రావు పరామర్శించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయిని ఇంద్రారెడ్డి,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సంకపల్లి సుమన్ రెడ్డి, నాయకులు ఆడెపు జై,పోలబోయిన నరేష్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

# మహిళా సాధికారతకు చిహ్నం ఇందిరమ్మ చీరలు

**నర్సంపేటలో ఘనంగా పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి**

**మహిళల ఆత్మగౌరవానికి ప్రజా ప్రభుత్వమే భరోసా**



**నర్సంపేట/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలోని ఆడబిడ్డల సంక్షేమం, ఆత్మగౌరవమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోందని నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ అన్నారు. సోమవారం నర్సంపేట మున్సిపాలిటీ కార్యాలయం వేదికగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు, పట్టణంలోని 25వ వార్డు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ఘనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు సారె పెట్టడం ఒక గొప్ప సంప్రదాయమని, ఆ సంప్రదాయాన్ని గౌరవిస్తూ ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇందిరమ్మ చీరలు కేవలం బహుమతి కాదు, మహిళల ఆత్మగౌరవానికి చిహ్నం. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు కట్టుబడి ఉంది అని ఆమె స్పష్టం చేశారు. నర్సంపేట పట్టణంలోని ప్రతి అర్హులైన మహిళకు ఈ చీరలు అందేలా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు.ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి పథకంలోనూ మహిళలకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి మున్సిపాలిటీ తరపున పూర్తి సహకారం ఉంటుందని పేర్కొన్నారు. పంపిణీ కార్యక్రమంలో భాగంగా మహిళలు ఉత్సాహంగా పాల్గొని చీరలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు . 25వ వార్డు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యూత్ విభాగం సభ్యులు వార్డు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బయ్యారం మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు.

**-తహాశీల్దార్ నాగరాజు.**



**బయ్యారం/మార్చి 23.(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండలంలో వాగులలో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల తాహాశీల్దార్ నాగరాజు తెలిపారు. సోమవారం మండలంలోని సుద్దరేవు, కోయగూడెం గ్రామ పరిసర ప్రాంతాలలో పాకాల,మసి వాగు కలిసే చోట అక్రమ ఇసుక తొలకాలు జరగకుండా జెసిబి సహయంతో ట్రెంచ్ (కందకాలు) ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ సందీప్, జిపిఓలు,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి నేషనల్ హైవేపై మృత్యు ఘోష

**నిత్యం ప్రమాదాలు.. గాలిలో దీపాల్లా ప్రాణాలు**

**సహకార బ్యాంకు కాలనీ వద్ద స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్లు ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్**



**ఎల్కతుర్తి/మార్చి 24 (జర్నలిస్ట్ వార్త):**
హన్మకొండ - కరీంనగర్ జాతీయ రహదారి (ఎన్ హెచ్ 563) ఎల్కతుర్తి మండల కేంద్రంలో మృత్యుకుహరంగా మారుతోంది. వేగంగా దూసుకొచ్చే వాహనాల ధాటికి నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానిక ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా సహకార బ్యాంకు కాలనీ సమీపంలో రద్దీ ఎక్కువగా ఉండటంతో, ఇక్కడ తక్షణమే స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్లు ఏర్పాటు చేయాలని బాధితులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### బ్యాంకుల వద్ద నిత్యం రద్దీ.. పెరిగిన ముప్పు

మండల కేంద్రంలోని మహేంద్రా కోటక్ బ్యాంక్, దక్కన్ గ్రామీణ బ్యాంక్, మరియు కో-ఆపరేటివ్ బ్యాంకులకు నిత్యం వందలాది మంది రైతులు, మహిళలు, ఖాతాదారులు వస్తుంటారు. ఈ ప్రాంతం ఎప్పుడూ జనంతో రద్దీగా ఉంటుంది. అయితే, హైవేపై వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్తుండటంతో రోడ్డు దాటడం కత్తిమీద సాములా మారింది. వారానికి కనీసం ఒక్కరైనా ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోవడం లేదా తీవ్ర గాయాలపాలవ్వడం ఇక్కడి విషాద పరిస్థితికి అద్దం పడుతోంది.

### నిబంధనల కంటే ప్రాణాలే ముఖ్యం..

జాతీయ రహదారులపై స్పీడ్ బ్రేకర్లు వేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ, పెరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా మానవీయ కోణంలో ఆలోచించాలని ప్రజలు కోరుతున్నారు. కనీసం స్పీడ్ నియంత్రణ పరికరాలు, జీబ్రా లైన్లు, బ్లింకర్ లైట్లు అయినా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ముందున్న మూలమలుపు వద్ద కూడా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి.

### అధికారులు స్పందించాలి..

ఇప్పటికైనా సంబంధిత ఎన్.హెచ్ అధికారులు మరియు ట్రాఫిక్ పోలీసులు స్పందించి, తక్షణమే ఈ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించాలి. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టి, ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాలని ఎల్కతుర్తి మండల వాసులు మీడియా ద్వారా గళమెత్తుతున్నారు.

## హైవేపై ప్రమాదాల నివారణకు జీబ్రా లైన్లు ఏర్పాటు చేయాలి

**కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోడిశాల అర్జున్ గౌడ్ డిమాండ్**



ఎల్కతుర్తి మండల కేంద్రం గుండా వెళ్లే జాతీయ రహదారిపై మితిమీరిన వేగంతో వాహనాలు ప్రయాణిస్తుండటంతో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై అధికారులు తక్షణమే స్పందించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోడిశాల అర్జున్ గౌడ్ కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ రహదారిపై జరిగిన పలు ప్రమాదాల్లో ఇప్పటికే అనేకమంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.జాతీయ రహదారులపై స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు సాంకేతిక, న్యాయపరమైన నిబంధనలు అడ్డంకిగా ఉన్నప్పటికీ, కనీసం ప్రజలు సురక్షితంగా రోడ్డు దాటేందుకు జీబ్రా లైన్లను అయినా వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు. నిత్యం రద్దీగా ఉండే బ్యాంకుల ఏరియాలో ఈ లైన్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని ఆయన సూచించారు.

# 26న నర్సంపేటలో మెగా జాబ్ మేళా

**టాటా, ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజ కంపెనీల రాక..**


**నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి**




**నర్సంపేట/మార్చి 23 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) వేదికగా ఈ నెల 26న భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ తెలిపారు. సోమవారం ఆయన కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. కళాశాల ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సెమినార్ హాల్‌లో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఈ మేళాకు టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్‌కాన్, అకార్డ్ పవర్ వంటి ప్రముఖ సంస్థలు హాజరవుతున్నాయి. డిగ్రీ పూర్తి చేసిన వారు, ఫైనల్ ఇయర్ విద్యార్థులతో పాటు బీటెక్, డిప్లొమా అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని ఆయన సూచించారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 98491-51377, 99480-48349, 94931-27804 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బైరి సత్యనారాయణ, అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ కందాల సత్యనారాయణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రహిముద్దీన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# అర్ధరాత్రి మాయా లోకం..

## స్మార్ట్‌ఫోన్ గుప్పిట్లో చిక్కిన విలువల కోట



నేటి సమాజంలో సాంకేతికత అందించిన అద్భుతం స్మార్ట్‌ఫోన్. కానీ అదే ఫోన్ నేడు అనేక కుటుంబాల్లో చిచ్చుపెడుతున్న నిప్పురవ్వగా మారుతోంది. వయసుతో సంబంధం లేకుండా, పిల్లా పాపా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరి చేతిలోనూ ఇంటర్నెట్ ఉండటం ఒక వరమైతే.. దాని ద్వారా నీలి చిత్రాలు విస్తరించడం ఒక శాపంగా మారింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో నిద్రను చంపుకుని సాగిస్తున్న ఈ డిజిటల్ వ్యసనం మనిషి ప్రాణాలను, పవిత్రమైన దాంపత్య బంధాలను బుగ్గిపాలు చేస్తోంది.

### నిద్రలేని రాత్రులు.. నిర్వీర్యమవుతున్న జీవితాలు

గడియారం ముల్లు రాత్రి 12 దాటితే చాలు.. ప్రపంచం నిద్రపోతుంటే, ఒక వర్గం మాత్రం స్మార్ట్‌ఫోన్లలో అశ్లీల వెబ్‌సైట్లలో మునిగిపోతోంది.
వ్యసనంగా మారిన వేళలు,పగలు బాధ్యతలతో గడిపినా, రాత్రి ఒంటరితనం దొరకగానే ఫోన్ తీయడం, అశ్లీల చిత్రాలను గంటల తరబడి వీక్షించడం ఒక మానసిక రోగంగా మారుతోంది.
వయసుతో సంబంధం లేకుండా, అప్పుడే యవ్వనంలోకి అడుగుపెడుతున్న విద్యార్థుల నుండి, బాధ్యతాయుతమైన గృహస్థుల వరకు అందరూ ఈ విషవలయంలో చిక్కుకుపోతున్నారు. ఇది కేవలం కాలక్షేపం కాదు, మనిషి విచక్షణను హరించివేసే మత్తుమందు.

### సమిష్టిగా చేస్తున్న పొరపాటు.. సర్వనాశనానికి బాట

నేటి కాలంలో కొంతమంది దంపతులు నూతనత్వం కోసమో, వినోదం కోసమో కలిసి నీలి చిత్రాలను వీక్షించడం ఒక ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి. ఒక పురుషుడు లేదా ఒక స్త్రీ.ఇద్దరు ముగ్గురితో శారీరక సంబంధం కలిగి ఉండాలనే వికృత ఆలోచనలకు, అక్రమ సంబంధాలకు ఈ చిత్రాలే బీజం వేస్తున్నాయి. ప్రకృతి సిద్ధమైన ఆకర్షణను వదిలి, కృత్రిమమైన, హింసాత్మకమైన పద్ధతుల వైపు మనసు మళ్లుతుంది. ఫలితంగా భాగస్వామిని ఒక వస్తువులా చూడటం మొదలవుతుంది.

### విచక్షణ కోల్పోతున్న మనిషి

సైన్స్ పరంగా చూస్తే, అశ్లీల చిత్రాల వీక్షణ మెదడులో డోపమైన్ స్థాయిలను అసమతుల్యంగా మార్చి, మనిషిని వాస్తవ ప్రపంచానికి దూరం చేస్తుంది. నిజ జీవితంలోని భాగస్వామి అందంగానో, ఆకర్షణీయంగానో అనిపించకపోవడానికి ఈ కృత్రిమ చిత్రాలే కారణం. దీనివల్ల అసంతృప్తి పెరిగి, ఆత్మాహుతులు లేదా హత్యల వరకు వెళ్తున్న ఉదంతాలు నేడు ఆందోళన కలిగిస్తున్నాయి.

### ఆగం అవుతున్న అనుబంధాలు

వెండితెరపై కనిపించే మాయా ప్రపంచాన్ని నిజ జీవితంలో వెతుక్కోవడం వల్ల నిరాశ తప్పదు.
భాగస్వామితో గడపాల్సిన సమయాన్ని స్మార్ట్‌ఫోన్లతో గడపడం వల్ల మనసుల మధ్య గోడలు పెరుగుతున్నాయి. ఒకరికే సొంతం కావాలనే నియమాన్ని ధిక్కరించి, బహుళ సంబంధాల వైపు మొగ్గుచూపే చెడు తలంపులు సామాజిక గౌరవాన్ని మంటగలుపుతున్నాయి.

### నైతిక పునరుద్ధరణే శరణ్యం

రాత్రి పడుకునే ముందు ఫోన్లను పక్కన పెట్టే అలవాటు చేసుకోవాలి. బెడ్‌రూమ్‌లోకి ఫోన్ రాకుండా చూసుకోవడం ఉత్తమం. దంపతులు తమ బంధంలోని లోటుపాట్లను చర్చించుకోవాలి కానీ, నీలి చిత్రాల వైపు వెళ్లకూడదు .
ఒంటరిగా గడిపే సమయాన్ని తగ్గించి, కుటుంబ సభ్యులతో గడపడానికి ప్రాధాన్యతనివ్వాలి.
అశ్లీలత అనేది ఒక మాయా లోకం. అది మిమ్మల్ని లోపలికి లాక్కుని ప్రాణాలను, పరువును హరించివేస్తుంది. పచ్చని సంసారంలో నిప్పులు పోసుకోవడం కంటే, విలువల బాటలో నడవడమే శ్రేయస్కరం. తెరపై కనిపించే భ్రమల కంటే, కళ్లముందున్న అనుబంధాలే శాశ్వతమని గుర్తించినప్పుడే ఒక ఆరోగ్యకరమైన సమాజం రూపుదిద్దుకుంటుంది.



**సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్.**
**సెల్ నంబర్ 9701249103**

# నీ జీవితం.. నీ సంతకం

## అప్రమత్తతే ఆత్మరక్షణకు కవచం

మనిషి జీవితం ఒక తెల్లకాగితం వంటిది. దానిపై ఎలాంటి రాతలు ఉండాలో నిర్ణయించే అధికారం కేవలం ఆ వ్యక్తికి మాత్రమే ఉంటుంది, నేటి సమాజంలో పెరిగిపోతున్న కృత్రిమ సంబంధాలు, నమ్మక ద్రోహాలు చూస్తుంటే.మనిషి తన జీవితపు పగ్గాలను ఇతరుల చేతికి ఇస్తున్నాడా అన్న సందేహం కలుగుతోంది. గుర్తుంచుకోవాల్సిన ప్రాథమిక సూత్రం ఒక్కటే నీ అనుమతి లేకుండా నీ జీవితాన్ని ఎవరూ నాశనం చేయలేరు. మన ప్రమేయం లేకుండా మన మనసును గాయపరిచే శక్తి ఎవరికీ లేదు. ఈ విచక్షణను కోల్పోయినప్పుడే జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయి.

### అనుమతి ఇవ్వద్దు.. దెబ్బతినొద్దు

చాలామంది తమ వైఫల్యాలకు ఇతరులను బాధ్యులను చేస్తారు. వాస్తవానికి మనం ఎవరికైతే మన జీవితంలోకి ప్రవేశించే అనుమతి ఇస్తామో, వారు మాత్రమే మనల్ని ప్రభావితం చేయగలరు. తప్పుడు మనుషులకు మన ఆలోచనల్లో చోటు ఇవ్వడం అంటే, మన వినాశనానికి మనమే పునాది వేసుకోవడం వంటిది. మన బలహీనతలే ఇతరులకు ఆయుధాలుగా మారుతున్నాయి. అందుకే, మన అంతరాత్మ అనే కోటకు మనమే కాపలాదారులం కావాలి.

### గడప దాటనివ్వొద్దు.. వీధిలోకి రానివ్వొద్దు

సమాజంలో ముసుగు వేసుకుని తిరిగే మనుషులు ఎందరో ఉంటారు. తీపి మాటలతో మనల్ని బుట్టలో వేసుకుని, పచ్చని జీవితాల్లో చిచ్చుపెట్టే విష పురుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.
ఒక వ్యక్తి ప్రవర్తన, ఆలోచనా తీరు మన వ్యక్తిత్వానికి లేదా మన ఎదుగుదలకు ఆటంకంగా అనిపిస్తే.అక్కడే గీత గీయాలి. దూరం పాటించడం,తప్పుడు వ్యక్తులను గుండెల్లోకి చేర్చుకోవడం పక్కన పెడితే, అసలు వారిని మన ఇంటి వీధిలోకి కూడా రానివ్వకూడదు. అంటే, మన సామాజిక సర్కిల్‌లో కూడా వారికి చోటు ఉండకూడదు. మొహమాటానికి పోయి దుష్టులకు చోటు ఇస్తే, అది ముదిరి పాకాన పడి మన సంసారాన్ని, భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తుంది.

### ఆత్మగౌరవమే అసలైన ఆయుధం

ఎవరైనా మనల్ని కించపరిచినా, మోసం చేసినా దానికి కారణం మనం వారికి ఇచ్చిన అతి స్వేచ్ఛ కావచ్చు. మన వ్యక్తిత్వానికి ఒక విలువ ఉండాలి. ఆ విలువను దాటి లోపలికి వచ్చే సాహసం ఎవరూ చేయకూడదు. ప్రతి బంధానికి ఒక హద్దు ఉండాలి. ఆ హద్దు దాటితే ఎంతటి వారినైనా దూరం పెట్టే ధైర్యం ఉండాలి. మన ఆనందం ఇతరుల మీద ఆధారపడి ఉన్నంత కాలం మనం బలహీనులమే. మనల్ని మనం ప్రేమించుకోవడం మొదలుపెడితే, తప్పుడు మనుషుల అవసరం మనకు ఉండదు. జీవితం అనేది దేవుడు ఇచ్చిన వరం. దానిని ఎవరో పనికిరాని వ్యక్తుల కోసం, తప్పుడు ఆలోచనల కోసం బలిపెట్టడం అత్యంత విచారకరం. మన జీవిత ప్రయాణంలో ఎవరిని చేర్చుకోవాలి, ఎవరిని గేటు బయటే ఉంచాలి అనే విచక్షణే మనల్ని కాపాడుతుంది. తప్పుడు మనుషులకు మన జీవితంలో 'నో ఎంట్రీ' బోర్డు తగిలించిన రోజే. మన జీవితం ప్రశాంతంగా, అర్థవంతంగా మారుతుంది. నీ జీవితానికి నువ్వే యజమానివి.ఆ అధికారాన్ని ఎవరికీ ధారాదత్తం చేయొద్దు.



**సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్.**
**సెల్ నంబర్ 9701249103**